క్లుప్తంగా

శ్రీరామతీర్థ క్షేత్ర మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆసిఫాబాద్‌ మండల శ్రీరామ తీర్థక్షేత్ర మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సంయోజక్‌గా ఇరుకుల ఆంజనేయులు, సహ సంయోజక్‌గా గుర్రాల వెంకటేశ్వర్లు, సభ్యులుగా చిలువేరు వెంకన్న, సత్యనారాయణ, యాదగిరి, జంజిరాల శ్రీనివాస్‌, గణేశ్‌, హరికృష్ణ, వారణాసి శ్రీనివాస్‌రావ్‌, కవ్వాల నరేశ్‌, ఆవిడపు ప్రణయ్‌, బండి శ్రీనివాస్‌, చెన్నూరి అశోక్‌, రాజు, విజయ్‌కుమార్‌, సురేష్‌, గంధం శ్రీనివాస్‌ ఎన్నికయ్యారు.

కేంద్ర పథకాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాంకిడి: వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని కోమటిగూడ, ఖిరిడి గ్రామాల్లో కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ధన్‌జన్‌ యోజన, సురక్ష బీమా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో మాస్కులు ధరించాలని సూచించారు. హెఈవో రవిదాస్‌, వైద్యసిబ్బంది, వ్యవసాయ, బ్యాంకు, అధికారులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

లింగాపూర్‌: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వెలువాక శ్రీకాంత్‌చారి కోరారు. మండల కేంద్రంలోని జగదాంబ ఆలయంలో సోమవారం ఆయన విశ్వకర్మలతో మాట్లాడారు. విశ్వకర్మల కోసం ప్రధాని మోదీ విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సమావేశంలో పోచ్చయ్యచారి, పి.శ్రీనివాస్‌, జి.విజేశ్‌, ఎస్‌.రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం



హోమం చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 50వ వార్షికోత్సవం సందర్భంగా భాగంగా ఆలయంలో సోమవారం గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు అంబేద శంకరయ్య ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దున్నపోతు వేలం



దహెగాం: మండలంలోని ఐనం గ్రామంలో గత రెండునెలలుగా పంటలను నాశనం చేస్తున్న దున్నపోతును బంజరుదొడ్డికి తరలించినట్లు సర్పంచ్‌ జయేందర్‌, కార్యదర్శి రాజేశ్‌ సోమవారం తెలిపారు. దీనికి సంబంధించిన ఎవరైన ఉంటే మంగళవారం లోగా పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. లేకపోతే దున్నపోతును వేలం వేస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న దత్త నవరాత్రి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సిర్పూర్‌(టి): మండలకేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయంతోపాటు నవేగాం గ్రామంలోని శివసాయి గణేశ్‌ ఆలయంలో దత్త నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయాల్లో భక్తులు సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. నవేగాంలో ముగింపు ఉత్సవాల్లో భాగంగా మంగళ, బుధవారాల్లో ప్రత్యేక పూజలు, జాతర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పెంచికల్‌పేట్‌ చర్చిలో పశువుల పాకలో ఏసుక్రీస్తు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్‌ వేడుకలు



కౌటాలలో..

కౌటాల/సిర్పూర్‌(టి)/దహెగాం/జైనూర్‌/పెంచికల్‌పేట్‌/రెబ్బెన/కెరమెరి: జిల్లావ్యాప్తంగా క్రిస్మస్‌ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జననం గురించి పాస్టర్లు దైవ సందేశమిచ్చారు. అనంతరం కేక్‌కట్‌ చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు క్రిస్మస్‌ వేషధారణలో ఆకట్టుకున్నారు. కౌటాల మండలంలోని శివలింగపూర్‌ చర్చిలో క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. జైనూర్‌, సిర్పూర్‌(యూ), లింగాపూర్‌ మండలాల్లో ట్రూ ఫ్రెండ్‌ బాప్టిస్ట్‌ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ కనక యాదవరావు, చిన్నారులు పాల్గొన్నారు.



కౌటాల: సదాశివపేట చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు



దహెగాం: చినరాస్పల్లిలో కేక్‌ తినిపిస్తూ..



కౌటాల: గుండాయిపేటలో క్రైస్తవులకు దుస్తులు అందిస్తూ..



కౌటాల: విజయనగరం చర్చిలో..



రెబ్బెన: ప్రభుత్వ కానుకలు అందిస్తున్న జెడ్పీటీసీ సంతోష్‌



కెరమెరి: సందేశమిస్తున్న పాస్టర్‌ ప్రేంకుమార్‌

అయ్యప్ప మండలపూజ కరపత్రాల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి మండల పూజ ఈనెల 27న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో మండల పూజకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే కోవలక్ష్మి దీక్షా స్వాములతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అన్నదాన కార్యక్రమానికి తనవంతుగా రూ.50వేలు విరాళాన్ని అందజేశారు. సింగిల్‌ విండో చైర్మన్‌ అలీబిన్‌ అహ్మద్‌, గురుస్వాములు నలిని మోహన్‌, వేణుగోపాల్‌, చిట్టి మల్ల సంతోష్‌, బట్టుపల్లి సంతోష్‌, దూడల అశోక్‌, శ్యాంరావ్‌, చంద్రమోహన్‌, స్వాములు సంతోష్‌, వినోద్‌, పిన్నా సాయి, రాధాకృష్ణగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతులు దహనం



దహనం చేస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్‌ బుద్ధవిహార్‌ ఆవరణలో అంబేద్కర్‌ సంఘం నాయకులు సోమవారం మనుస్మృతి గ్రంథం ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుస్మృతి అట్టడుగు వర్గాల అభివృద్ధికి అడ్డుగా ఉందని అంబేద్కర్‌ గుర్తించి 1927 డిసెంబర్‌ 25న అనుచరులతో కలిసి మనుస్మృతి ప్రతులను దహనం చేశారన్నారు. కొందరు అగ్రవర్ణాలలో మనుస్మృతి భావజాలం ఇప్పటికీ ఉందన్నారు. భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్‌ మహోల్కర్‌, మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, నాయకులు ఉప్రే విజయ్‌, ఖోబ్రగడె విలాస్‌, దుర్గాజీ, రోన్‌, సందీప్‌, ప్రతాప్‌, టేమాజీ, దేవాజీ, అశోక్‌ పాల్గొన్నారు.

వంతెన లేక అవస్థలు



జగన్నాథ్‌పూర్‌ గ్రామం వద్ద గల రాగిపాటి ఒర్రె

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని జగన్నాథ్‌పూర్‌ శివారులో గల రాగిపాటి ఒర్రె పై వంతెన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఒర్రెలో నిత్యం నీరు ఉండటంతో దాటేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాగజ్‌నగర్‌ మండలంలోని బోరిగాం, భీమిని మండలంలోని కర్జిభీంపూర్‌, లక్ష్మీపూర్‌, భీమిని, బిట్‌వెల్లి, రాంపూర్‌, మల్లీడు, దుబ్బగూడ, వడాల గ్రామాల ప్రజలు ప్రతినిత్యం ఈ మార్గం గుండానే కాగజ్‌నగర్‌కు వస్తుంటారు. ప్రతీరోజు విద్యార్థులు, ప్రైవేట్‌ సంస్థల్లో పనిచేసే కార్మికులు, పాల వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా అందవెల్లి, జగన్నాథ్‌పూర్‌ గ్రామాల రైతులకు చెందిన భూములు ఈ ఒర్రె అవతలి వైపున ఉన్నాయి. వర్షాకాలంలో ఒర్రెను దాటుకుంటూ రైతులు వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా జగన్నాథ్‌పూర్‌ నుంచి కర్జిభీంపూర్‌ వరకు మట్టిరోడ్డు ఉంది. వర్షాకాలంలో బురదమయంగా మారడంతో గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఒర్రెపై వంతెనతోపాటు రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

ఒర్రెపై వంతెన నిర్మించాలి



రాగిపాటి ఒర్రెపై వంతెన నిర్మించాలి. భీమిని, కాగజ్‌నగర్‌ మండలాలవాసులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. భీమిని మండలానికి ఈ మార్గం గుండానే చాలామంది ప్రయాణిస్తుంటారు.

– డోకె రవి, సర్పంచ్‌, జగన్నాథ్‌పూర్‌

చర్యలు తీసుకోవాలి



జగన్నాథ్‌పూర్‌ నుంచి కర్జిభీంపూర్‌ వరకు మట్టి రోడ్డు ఉండటంతో వర్షాకాలం బురదగా మారుతుంది. బైక్‌లు వెళ్లలేని పరిస్థితి. అధికారులు వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– రాగి రాజయ్య, బోరిగాం

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్‌ విజయలక్ష్మి

కెరమెరి: మండలంలోని ఖైరీ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలే మిగిలిన నాలుగు కుటుంబ సభ్యులకు సోమవారం దాతలు రూ.73,550 ఆర్థికసాయం చేశారు. సర్పంచ్‌ లెండుగురే విజయలక్ష్మి, నాయకుడు బాలాజీ రూ.16 వేలు, గ్రామస్తులు రూ.40,550, ఇంద్రానగర్‌ గ్రామానికి చెందిన వారు రూ.17 వేలు, సీఐ శ్రీనివాస్‌, ఎస్సై విజయ్‌లు సరుకులతోపాటు రూ.5 వేల నగదు అందజేశారు. గ్రామపెద్దలు పటేల్‌ నాగోసే భిక్కు, జలపతి, బుదాజీ, సోము, ఇంద్రానగర్‌ గ్రామస్తులు సోంనాథ్‌, హేమాజీ, పోచయ్య, తిరుపతి, రాంచందర్‌, తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాకేంద్రంలో మోడల్‌ స్కూల్‌ వద్ద సోమవారం రాత్రి కారు అదుపు తప్పి బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లాకేంద్రంలోని హైకాజినగర్‌కు చెందిన అనిల్‌ పని నిమిత్తం కాగజ్‌నగర్‌ వెళ్లాడు. ఆసిఫాబాద్‌కు వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అనిల్‌ సురక్షితంగా బయటపడ్డారు.

పూలాజీబాబా బోధనలు అనుసరించాలి

జైనూర్‌: ప్రతి ఒక్కరూ పూలాజీబాబా బోధనలు అనుసరించాలని జైనూర్‌లో పూలాజీబాబా సంస్థాన్‌ అధ్యక్షుడు కేశవ్‌ ఇంగ్లే అన్నారు. మండలంలోని పట్నాపూర్‌ గ్రామంలోని బాబా ఆలయంలో జెండాకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఈనెల 26, 27 తేదీల్లో బాబా సమాధి సోహళా కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం నిర్మల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ ఈశ్వర్‌తో క్యాలెండర్‌ ఆవిష్కరించారు. రంగారావు, సతీశ్‌, రాందాస్‌, భగవంత్‌రావు ఉన్నారు.

వారసంతలో అన్నదానం

కౌటాల: కౌటాల వారసంతలో శ్రీ సత్యసాయి అన్న ప్రసాద సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు సమితి సభ్యులు, భక్తులు సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సోమవారం వారసంతలో సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తామన్నారు. సభ్యులు తిరుపతి, మధుకర్‌, మహేశ్‌, శివ, సత్తయ్య, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

నో ఏటీఎం



మండల కేంద్రంలోని బ్యాంకు వద్ద వేచిచూస్తున్న వినియోగదారులు (ఫైల్‌)

- కేంద్రాలు లేక ప్రజల ఇబ్బందులు
- నగదు విత్‌ డ్రా కోసం బ్యాంక్‌ ఎదుట నిరీక్షణ

తిర్యాణి: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. తాజాగా రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో వేస్తోంది. కానీ నగదు విత్‌డ్రా చేసేందుకు ఒక్క ఏటీఎం కేంద్రం లేకపోవడంతో రైతులతోపాటు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగదు కోసం బ్యాంకు ఎదుట నిరీక్షించాల్సిన పరిస్థితి. మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా, కేవలం మండల కేంద్రంలోనే టీజీబీ మాత్రమే ఉంది. ఇందులో దాదాపు 10 వేలకు పైగా ఖాతాలున్నాయి. మండల వ్యాప్తంగా ఒకే బ్యాంకు ఉండటం, ఏటీఎం కేంద్రం లేకపోవడంతో నగదు కష్టాలు తప్పడం లేదు.

పదుల సంఖ్యలో మినీ ఏటీఎంలు

మండల కేంద్రంలో బ్యాంకు సంబంధించిన ఏటీఎం లేవు. దాదాపు 30 కి.మీ పరిధిలో ఎలాంటి ఏటీఎం సెంటర్లు లేవు. దీంతో ఖాతాదారుల అవసరం కోసం ప్రైవేటు వ్యక్తులు పదుల సంఖ్యలో మినీ ఏటీఎంలు ప్రారంభించారు. ఖాతాదారుల వేలిముద్రల ఆధారంగా నగదు విత్‌డ్రా చేసి అందజేస్తున్నారు. ఇందుకోసం కమీషన్‌ తీసుకుంటున్నారు. మండలంలో అత్యధికంగా ఉన్న నిరక్ష్యరాసులైన గిరిజనులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఖాతాదారులకు తెలియకుండా నిర్వాహకులు తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై గతంలో పోలీసులకు పలు ఫిర్యాదులు అందాయి.

ఏటీఎం ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలోని ఉన్న ఏకైక బ్యాంకు వద్ద ఏటీఎం కేంద్రం లేదు. బ్యాంకు మూసి ఉన్న సమయంలో నగదు విత్‌డ్రాకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వినియోగదారుల కోసం ఏటీఎం కేంద్రంతోపాటు మరో బ్యాంకు ఏర్పాటు చేయాలి.

– పులి వెంకటేశ్‌, తిర్యాణి

దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందిస్తున్న సభ్యులు

కెరమెరి: మండలంలోని చిన్నుగూడ గ్రామంలో ప్రేరణ, సహృదయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పెరుగుతున్న చలి తీవ్రత కారణంగా పేదలకు దుప్పట్లు అందించినట్లు ఫౌండేషన్‌ చైర్మన్‌ శరత్‌ సుదర్శి తెలిపారు. నాయకులు మహేశ్‌ దుర్గె, మహాత్మే భీంరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ ఎ న్నికల్లో ఓటమికి కార్యకర్తలు నిరుత్సాహపడవద్దన్నారు. ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ సత్తా చాటుతుందని తెలిపారు. కాగజ్‌నగర్‌ మార్కె ట్‌ కమిటీ చైర్మన్‌ కాసం శ్రీనివాస్‌, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్‌ సంతోష్‌గౌడ్‌, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

లింగాపూర్‌: ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనునట్లు ఎంపీడీవో ప్రసాద్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆడె సవితాప్రైమ్‌ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. అధికారులు తమ నివేదికలతో రావాలని సూచించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి



పూలమాలలు వేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లోని బీఎంఎస్‌ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్‌ మాట్లాడుతూ దేశంలో వాజ్‌పేయి సుపరిపాలన అందించారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీఎంఎస్‌ కేంద్ర కార్యవర్గ సభ్యుడు రాజిరెడ్డి, పార్లమెంట్‌ కోకన్వీనర్‌ కిరణ్‌కుమార్‌, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి స్ఫూర్తి శిఖరం అవార్డు



అవార్డు అందుకుంటున్న నూతి అభిలాష్‌

వాంకిడి: మండలంలో సరండి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడి నూతి అభిలాష్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆన్‌లైన్‌ విద్యారంగంలో భాగంగా 95 వివిధ కోర్సులు పూర్తిచేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అభిలాష్‌ ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఆర్యాణి సకల సేవా కళావేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితీ సేవా సంస్థల ఆధ్వర్యంలో కరీంనగర్‌లో సోమవారం ఆయనకు జాతీయస్థాయి స్ఫూర్తి శిఖరం అవార్డు ప్రదానం చేశారు. భవానీ సాహిత్యవేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌, గిన్నీస్‌ బుక్‌హోల్డర్‌ డా.సుబ్రమణ్యం, రంగస్థల నటులు కృష్ణకుమారి, ప్రముఖ కవి పార్ల వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.